క్లుప్తంగా

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

పెద్దాపురం: గ్రామీణ యువత క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు అన్నారు. మండలంలోని పులిమేరు గ్రామంలో బుధవారం క్రికెట్ కోర్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ యువత పెడదోవ పడకుండా క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు. యువతకు అందుబాటులో క్రీడా పరికరాలు అందించనున్నామని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం క్రికెట్ కోర్టును ప్రారంభించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డైరెక్టర్ శివదత్, నీటి సంఘం ఉపాధ్యక్షుడు జట్ల విజయ్‌బాబు, తుమ్మల నాని, జట్లా రాంబాబు, వంగలపూడి దుర్గాజి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కొత్తపల్లి: స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పాడుతుందని ఏపీ ఈపీ డీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకరావు బుధవారం తెలిపారు. ఎండపల్లి, నాగులపల్లి, నాగులపల్లి ఉప్పరగూడెం, నాగులపల్లి పొన్నాడ, రమణక్కపేట, వాకతిప్ప ఎండీ పేట, ఎండపల్లి జంక్షన్, వాకతిప్ప సూరప్ప చెరువులకు ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఈఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

తిమ్మాపురం ఎస్సైగా గణేష్‌కుమార్



కాకినాడ రూరల్: తిమ్మాపురం ఎస్సైగా యర్రంశెట్టి గణేష్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోర్టు పీఆర్వోగా పనిచేసిన గణేష్‌కుమార్ తిమ్మాపురానికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు తిమ్మాపురం ఎస్సైగా పనిచేసిన రవీంద్రబాబు ఇటీవల కోనసీమ జిల్లాకు బదిలీపై వెళ్లారు. గణేష్‌కుమార్‌కు అదనపు ఎస్సై మూర్తి, రైటస్ ఆలీషా, సిబ్బంది స్వాగతం పలికారు. ఎస్‌బీ నుంచి వచ్చానని, లాండ్ అండ్ ఆర్డర్ సమస్యను పరిష్కరించడంతో పాటు బీచ్ సందర్శకులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేస్తానన్నారు. బీచ్ ప్రాంతంలో పార్కింగ్ చేస్తున్న వాహనాలలో విలువైన వస్తువులను సందర్శకులు ఉంచడంతో అవి దొంగతనం అవుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని దీనిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

గాంధీ పార్కులో దుర్గంధం

బోట్‌క్లబ్: స్థానిక గాంధీనగర్ పార్కులో సెప్టిక్ ట్యాంక్ నిండిపోయి వ్యర్థాలు బయటకు వచ్చి దుర్గంధం వెదజల్లుతున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉందని అధికారులకు సమాచారం ఇచ్చిన చర్యలు తీసుకోలేదని వాకర్స్ సభ్యులు మండిపడుతున్నారు. ఉదయం సాయంత్రం సుమారు 900 మందికి పైగా సందర్శకులు, వాకర్లు వస్తుంటారు. అటువంటి పార్కులో సదుపాయలు కూడా సక్రమంగా లేవు. పార్కులో చిన్నపిల్లల ఆట వస్తువులు, జిమ్ పరికరాలు మరమత్తులకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని వారు అంటున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాకినాడ సిటీ: సామర్లకోట మండలం వీకేరాయపురం రైల్వే పట్టాల మధ్యలో సుమారు 65 సంవత్సరాల వ్యక్తి రైలు ఢీకొని మరణించినట్లు రైల్వే ఎస్ఐ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతి చెందిన వ్యక్తి బ్రౌన్‌కలర్ ప్యాంటు, మొలతాడుకు తావీదు కట్టి ఉందని, చామనఛాయ రంగు కలిగి ఉన్నాడన్నారు. ఎడమ కాలు మడమ తెగి వేలాడుతుందని, కుడికాలు మడమ తెగిపడి ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు 94407 02328 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చని ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

ఎన్టీఆర్‌కు నివాళులు



సామర్లకోటలో ఎన్టీఆర్‌కు నివాళి అర్పించిన అభిమానులు, టీడీపీ నాయకులు

సామర్లకోట: ఎన్టీఆర్ జయంతిని పట్టణ, మండల పరిధిలో బుధవారం నిర్వహించారు. స్థానిక మఠంసెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి, లారీ స్టాండ్ వద్ద ఉన్న విగ్రహానికి, కొత్తూరులో ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమాలల్లో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోలి వెంకటఅప్పారావుచౌదరి, యార్లగడ్డ చిన్ని తదితరులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్‌కు నివాళులు అర్పించారు.

ఏపీఎస్పీలో..

కాకినాడ రూరల్: ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి కమాండెంట్ నాగేంద్రరావు, సిబ్బంది పూల మాలలు వేసి నివాళులర్పించారు. అచ్చంపేట జంక్షన్ వద్ద ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో ప్రిన్సిపాల్ ప్రశాంతి శ్రీ, సిబ్బంది ఎన్టీఆర్ జయంతి వేడుకలో పాల్గొన్నారు.

బాబ్బాబు.. గౌరవించండి ప్లీజ్!

- వేడుకుంటున్న ఎంపీటీసీ సభ్యులు
- 19 నెలల వేతనాలు అందక అవస్థలు

పెద్దాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా అగౌరవపరుస్తోంది. ప్రభుత్వం ప్రతి ఎంపీటీసీ సభ్యునికి నెలకు రూ.3 వేల వంతున గౌరవ వేతనం చెల్లించాలి. నియోజకవర్గంలో సామర్లకోటలో 18 మంది, పెద్దాపురంలో 21 మంది వెరసి 39 మంది ఎంపీటీసీలు ఉన్నారు. వీరికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దఫదఫాలుగా ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల వల్ల గత ప్రభుత్వం ఎంపీటీసీలకు వేతనాలు చెల్లించలేకపోయింది. జూన్ 2024లో కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అంతకు ముందు పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటి వరకు 19 నెలల నుంచి వేతనాలు రావల్సి ఉందని ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. గౌరవ వేతనం మంజూరు చేయకపోవడంతో అధికార, విపక్ష ఎంపీటీసీ సభ్యులనే తేడా లేకుండా ప్రభుత్వంపై అసంతప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు రావాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

గౌరవం ఇవ్వడం లేదు

ప్రజల చేత ఎన్నికైన ప్రజా ప్రతినిధులమైనా ఏ మాత్రం గౌరవం ఇవ్వడం లేదని ఎంపీటీసీలు వాపోతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో టీడీపీ నాయకులకు ఇచ్చిన ప్రాధాన్యం అధికారులు తమకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి సర్వసభ్య సమావేశాలకు హాజరు కావడమే తప్ప తాము ప్రజా సమస్యలను పరిష్కరించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. గతంలో జరిగిన పెద్దాపురం మండల సర్వ సభ్య సమావేశంలో పలువురు ఎంపీటీసీలు ఈ విషయాన్ని ప్రశ్నించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సంగతి కూడా తెలియపరచడం లే దని, కనీసం గ్రామంలో జరుగుతున్న పనులైనా తమ దృష్టికి తీసుకురాకుండానే ఏకపక్ష నిర్ణయాలతో చేసుకుపోతున్నారని ప్రజాప్రతినిధులు ఆరోపించారు.



పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయం

ప్రజాప్రతినిధులుంటే అంత అలుసా



ప్రజాప్రతినిధులంటే కూటమి ప్రభుత్వానికి అంత అలుసైపోయామా. ఎంపీటీసీ సభ్యులందరూ ఆర్థిక స్థోమత కలిగిన వారిలా ప్రభుత్వం భావిస్తోంది. దాదాపు 20 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే సభలు, సమావేశాలకు ఎలా రావాలి?

– జాగు వీరభద్రరావు, ఎంపీటీసీ, కాండ్రకోట

వెంటనే మంజూరు చేయాలి



ఎంపీటీసీలకు కూటమి ప్రభుత్వం గౌరవ వేతనాలు ఇవ్వడం లేదు. సభలు, సమావేశాలకు మండల కేంద్రానికి వచ్చి పోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని. కూటమి ప్రభుత్వం స్పందించి, ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనాలు వెంటనే మంజూరు చేయాలి.

– మిరియాల రాజా, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు, మర్లావ, పెద్దాపురం మండలం

గౌరవ వేతనం విడుదలకు చర్యలు



మండలంలోని ఆయా గ్రామాల ఎంపీటీసీల గౌరవ వేతనం విడుదలకు చర్యలు చేరుకుంటాం. ప్రభుత్వం నుంచి ఎటువంటి బిల్లులు విడుదల కాకపోవడంతో ఆరు నెలల గౌరవ వేతనం పెండింగ్ పడింది. మొదటి త్రైమాసికం వేతనానికి బిల్లు పెట్టాం. బిల్లు విడుదల కాగానే ఆ మొత్తాలను పంపిణీ చేస్తాం.

– శ్రీలలిత, ఎంపీడీఓ, పెద్దాపురం

మున్సిపల్ అజెండాపై సందిగ్ధం



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం

సామర్లకోట: మున్సిపల్ అజెండా తయారీపై అధికారులలో సందిగ్ధత నెలకొంది. ప్రతి నెల కౌన్సిల్ పాలక మండలి సాధారణ సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై ఆమోదం తీసుకోవలసి ఉంటుంది. కౌన్సిల్ తీర్మానాలకు లోబడి అధికారులు అభివృద్ధి పనులు చేయాలి. ఈ మేరకు కౌన్సిల్ సమావేశంలో చర్చించాల్సిన అభివృద్ధి పనులపై అజెండా తయారు చేసి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆమోదంతో ఆమె సంతకం చేసిన తరువాత నాలుగు రోజులు ముందుగా కౌన్సిల్ సభ్యులకు అజెండా అందజేయాల్సి ఉంది. అయితే బుధవారం నాటికీ మున్సిపల్ అజెండా తయారు కాలేదు. ఈ అజెండాపై ఎవరి సంతకం తీసుకోవాలనే సందిగ్ధంలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యను సాక్షి వివరణ కోరగా సీడీఎంఎ సూచనల మేరకు అజెండా తయారు చేయాల్సి ఉందన్నారు. అజెండా తయారు అంశం సీడీఎంఎ దృష్టిలో ఉంచామని తెలిపారు. సమావేశం నిర్వహణకు సమయం తక్కువగా ఉండటం వల్ల అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ నెల 31 లోపుగా కౌన్సిల్ సమావేశం నిర్వహించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.

సంప్రదాయాన్ని సమాధి చేయకండి



అగ్రహారంలో భూమిని చదును చేయిస్తున్న రెవెన్యూ అధికారులు

- ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి అగ్రహారంలో ఏర్పాట్లు
- మరుభూమిని ముట్టుకోవద్దని కోరుతున్న ఓ వర్గం ప్రజలు

పిఠాపురం: స్థానిక అగ్రహారంలో నిర్మించ తలపెట్టిన ఇండస్ట్రియల్ ప్లాంట్ కాంప్లెక్స్ పార్కు కోసం కేటాయించిన స్థలంలో తమ పూర్వీకుల సమాధులు ఉన్నాయని దానిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని అగ్రహారం వాసులు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. అగ్రహారం సర్వే నంబరు 774–1లో సుమారు 4.20 ఎకరాల భూమి ఉంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పారిశ్రామికీకరణ చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అనువైన స్థలాలు లభ్యమైన చోట ఇండస్ట్రియల్ ప్లాంట్ కాంప్లెక్స్ పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పిఠాపురంలో ఇండస్ట్రియల్ ప్లాంట్ కాంప్లెక్స్ పార్కు నిర్మాణానికి అనువైన స్థలంగా అగ్రహారం స్థలాన్ని కేటాయించారు. దీనిని చదును చేసేందుకు తహసీల్దారు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో రెండు రోజులుగా ప్రయత్నిస్తున్నారు. దీంతో స్థానికులు ఆ పనులను అడ్డుకుని, ఈ ప్రాంతంలో తమ పూర్వీకుల సమాధులు ఉన్నాయని దానిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోరారు. అయితే ఇది ప్రభుత్వ భూమి కాబట్టి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉందని అధికారులు వారిని హెచ్చరించారు. ఎంత చెప్పినా అధికారులు వినకపోవడంతో వారు తమ అభిప్రాయాన్ని కలెక్టర్‌కు వివరించారు. ఆయన సైతం సానుకూలంగా స్పందించకపోవడంతో మరుభూమికి సుమారు 60 సెంట్లు వదిలేసే మిగిలిన భూమిలో నిర్మాణాలు చేపట్టనున్నట్లు అధికారులు చెప్తున్నారు. రెండు రోజుల్లో రాష్ట్ర మంత్రులు ఇక్కడ శంకుస్థాపన చేసేందుకు అధికారులు ఏర్పాట్లు వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో స్థానికులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. పూర్వం నుంచి ఉన్న ఆచారాన్ని సమాధి చేయడానికి ప్రయత్నిస్తే తాము ఊరుకునేది లేదని స్థానికులు చెప్తున్నారు. కళ్లెదుట సమాధులు కనిపిస్తున్నా ఏమి లేనట్టు అధికారులు చెబుతున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ స్థల వివాదం రచ్చకెక్కింది.



భూమిలో ఉన్న సమాధులు

● అధినేతతో భేటీ



వైఎస్ జగన్‌ను కలుసుకున్న గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిలర్లు, నాయకులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిలర్లు బుధవారం తాడేపల్లిలో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీతా విశ్వనాథ్ ఆధ్వర్యంలో వైఎస్ జగన్ కౌన్సిలర్లతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గండ్రేటి మంగతాయారు, గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, జ్యోతుల భీముడు పలువురు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



నియోజకవర్గ కోఆర్డినేటర్ వంగా గీత, గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్ పర్సన్ దంపతులు

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

సామర్లకోట: డిమాండ్ల సాధనకు మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె బుధవారం 22వ రోజు కొనసాగించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికుల ఆకలి బాధలు తీర్చాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ నెలకు రూ.13 వేలు చేతికి వస్తే తమ కుటుంబాలను పెరిగిన ధరలతో ఎలా పోషించుకోవాలన్నారు. 15 ఏళ్లు దాటి పని చేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోతే రూ.10 లక్షలు, అంగవైకల్యం చెందితే రూ.ఐదు లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులు వర్తింప చేయాలనే కోరుతూ సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. గతంలో ఏడు నెలల క్రితం సమ్మె చేయగా సమస్యలు పరిష్కరిస్తామని సీడీఎంఏ హామీ ఇచ్చి ఇప్పటి వరకు సమస్యలు పరిష్కరించకపోవడంతో ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మె ప్రారంభించినట్లు కార్మిక సంఘ నాయకులు తెలిపారు.



సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ కార్మికులు

ప్రతి గ్రామంలో యోగా శిక్షణ

- టీఓటీలకు ఇన్‌చార్జి ఎంపీడీఓ భైరవమూర్తి ఆదేశం

సామర్లకోట: యోగా శిక్షణలో మెళకలను నేర్చుకుని టీఓటీలుగా ఆయా గ్రామాలకు వెళ్లి గ్రామస్తులకు యోగా శిక్షణ ఇవ్వాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ భైరవమూర్తి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండల పరిధిలోని హుస్సేన్‌పురం, మాధవపట్నం, నవర, పీబీ దేవం గ్రామాలలోని సచివాలయ సిబ్బందికి బుధవారం యోగా శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21 నాటికి ప్రతి గ్రామంలో యోగా శిక్షణ పూర్తి చేయాలన్నారు. యోగా మాసోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 31 వరకు నిత్యం ఉదయం ఏడు నుంచి 9 గంటల వరకు శిక్షణ ఉంటుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం యోగాకు సమయం కేటాయించాలన్నారు. విద్యార్థులు, చిన్నారులు చిన్నతనం నుంచి యోగాపై అవగాహన పెంచుకొవడంతో వారిలో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ప్రజలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. యోగాపై ముందుగా అవగాహన ఉండాలన్నారు. ఫిజికల్ డైరెక్టర్ యార్లగడ్డ బంగ్రారాజు, కె.శ్రీనివాసరావు, రవి, జగదాంబ యోగాపై శిక్షణ ఇచ్చారు.



యోగా శిక్షణలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది

మున్సిపల్ కార్యాలయంలో..

అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మెప్మా, మున్సిపల్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జేవీవీ ప్రాంతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న జేవీవీ నాయకులు

కాకినాడ సిటీ: జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల వివిధ స్థాయిల బాధ్యులకు స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం జనవిజ్ఞాన వేదిక సదస్సు నిర్వహించినట్లు వేదిక జిల్లా అధ్యక్షులు కేఎంఎంఆర్ ప్రసాద్ తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ఉదయం చరిత్రలో సైన్స్ అనే అంశంపై ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రసంగించారు. చరిత్రలో ఏ సందర్భంలో సైన్స్ ఏ విధంగా వ్యవహరించిందో సోదాహరణంగా వివరించారు. మధ్యాహ్నం మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్ జనవిజ్ఞాన వేదిక నిర్మాణం–కొన్ని ప్రాధాన్యాలపై మాట్లాడారు. జూన్ 1వతేదీ నుంచి జన విజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదులు చేపడతామన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

కొత్తపల్లి: సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మండల సీఐటీయూ ప్రధాన కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. మండలంలో వాకతిప్పలో బుధవారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశమై సమ్మె వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. జూన్ 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పోరాడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాంబశివకుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




భవన నిర్మాణ కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

గొప్పాయ్!

- నేలనంటేలా బొప్పాయి దిగుబడి
- దానికి తగ్గట్టే రాబడి
- ప్రకృతి విధానంలో సాగు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

పిఠాపురం: ధరణికి గిరి భారమా.. గిరికి తరువు భారమా.. తరువుకు కాయ భారమా.. కని పెంచే తల్లికి పిల్ల భారమా అన్నారు సినీ గేయ రచయిత జూనియర్ సముద్రాల. నిజమే కదా.. తరువుకు కాయ భారం కానేకాదనడానికి ఈ బొప్పాయి చెట్లే నిలువెత్తు సాక్ష్యం. మామూలు చెట్లలా బొప్పాయి చెట్టు కాండం అంత బలమైనదేమీ కాదు. లోపల గుల్లగా.. పీచు పదార్థంతో ఉంటుంది. ఈ చెట్లను చూస్తే నిండా నాలుగడుగులు కూడా పెరగకుండానే సుమారు వంద కాయ వరకు కాపునిచ్చాయి. ఒకొక్కటి సగటున ఐదు కిలోలు వేసుకున్నా ఐదు వందల కిలోల కాయలు మోస్తోంది. పెరుగుతూనే కాండం అంతా కాయలతో ఆకట్టుకుంటున్న ఈ తోటలో పంద్రా (15) రకం విత్తనం వేసి ప్రకృతి విధానంలో సాగుచేసినట్టు రైతులు చెప్తున్నారు. గొల్లప్రోలు మండలంలో సుమారు 200 ఎకరాల వరకు బొప్పాయి సాగు చేపట్టగా వాటిలో సుమారు 70 ఎకరాలల్లో ప్రకృతి విధానంలో సాగుచేస్తున్నారు. ఆశ్చర్యపరిచే రీతిలో దిగుబడి వస్తోందని, దానికి తగ్గట్టే రాబడీ వస్తోందని రైతులు ఉబ్బి తబ్బిబ్బవుతున్నారు.



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో విరగ కాసిన బొప్పాయి తోట. (అంతర చిత్రం) దుర్గాడలో బొప్పాయి చెట్టు ఇలా..

ఫుడ్ లైసెన్సు లేకపోవడం నేరం

- జయలక్ష్మి థియేటర్‌లో ఫుడ్‌సేఫ్టీ అధికారి తనిఖీ
- 77 చిప్స్ ప్యాకెట్ల సీజ్

సామర్లకోట: ఆహార పదార్థాలు విక్రయించే ప్రదేశాల్లో తప్పని సరిగా ఫుడ్ లైసెన్సు ఉండాలని ఫుడ్ సేఫ్టీ అధికారి సుబ్బారావు అన్నారు. బుధవారం స్థానిక జయలక్ష్మి థియేటర్ స్టాల్స్‌లో విక్రయిస్తున్న తినుబండారాలను తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఆయన పరిశీలించారు. ఈ మేరకు థియేటర్‌లో ఎటువంటి గుర్తింపు లేని 77 చిప్స్ ప్యాకెట్లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని పరీక్షలకు పంపుతామని తెలిరు. థియేటర్లలో తప్పని సరిగా ఫుడ్ లైసెన్సు ఉండాలని, అయితే జయలక్ష్మి థియేటర్‌లో ఫుడ్ లైసెన్సు లేక పోవడం నేరమని, దీనికి సంబంధించి కేసు నమోదు చేసి నోటీసు జారీ చేస్తామన్నారు. నోటీసు ఆధారంగా ఫుడ్ లైసెన్సు తీసుకొనే అవకాశం ఇస్తామన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మంగళవారం రాత్రి కలెక్టరు ఆదేశాల మేరకు థియేటర్ తనిఖీ చేసి ఫుడ్ లైసెన్సు లేక పోవడం, అన్ బ్రాండెడ్ చిప్స్ విక్రయిస్తున్నట్లు గుర్తించి కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లినట్టు తెలిపారు. దాంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు వచ్చి తనిఖీ చేశారన్నారు. అయితే నాలుగు రోజులుగా థియేటర్‌లో షోలు వేయడం లేదని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో థియేటర్ మేనేజరు వర్రే సతీష్, వీఆర్వో నూతలపాటి లోవరాజు పాల్గొన్నారు.



చిప్స్ ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు